విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

పశువుల ఆహార పోషణ కోసం దాణామృతం కింద 75 టన్నుల పంపిణీ

విశాలాంధ్ర - కొవ్వూరు విశాలాంధ్ర : కొవ్వూరు నియోజక వర్గ పరిధిలో రూ.12 లక్షల విలువైన దాణామృతం నేడు పశు పోషణ రైతులకు అందచెయ్యడం జరుగుతోందని రాష్ట్ర హెూం మంత్రి డా తానేటి వనిత పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పశు వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత పశు దాణా పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర హెూం మంత్రి డా తానేటి వనిత మాట్లాడుతూ, ఇటీవల మిచౌంగ్ తుఫాను కారణంగా భారీ వర్షాల సూచనలు నేపథ్యం లో పశువుల ఆహారానికి ఎటువంటి లోటు లేకుండా చూసేలా ఉచితంగా పశు దాణా పంపిణీ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఆమేరకు కొవ్వూరు నియోజక వర్గ మిచౌంగ్ తుఫాన్ ముంపుకు గురైనటువంటి ప్రాంతాలలోని గ్రామాల రైతులకు ఉచితంగా "దాణామృతం - టిఎమ్ఆర్" ను రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. సుమారు రూ .12 లక్షల విలువైన 75 టన్నులు పశు దాణా ను చాగల్లు కొవ్వూరు తాళ్లపూడి మండలాలకు చెందిన పశు పోషకులకు దాణా మృతం ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో పశువుల పోషణ కోసం ముఖ్యమంత్రి జగనన్న చిత్త శుద్ధికి ఇటువంటి సంఘటనలు ప్రత్యక్ష ఉదాహరణ నిలుస్తున్నయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 300 మంది రైతులకు లబ్ధి చేకూరుస్తూ దాణామృతమును ఉచితంగా పంపిణీ చేశామని జిల్లా పశు సంవర్ధక అధికారి డా ఎస్ జి టి సత్య గోవింద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్న కుమారి, జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎస్ జి టి సత్య గోవింద్ , ఉప సంచాలకులు డాక్టర్ జి . రాధాకృష్ణ, ప్రాంతీయ పశు వైద్యశాల కొవ్వూరు సహాయ సంచాలకులు డాక్టర్ ఏ .వెంకటరెడ్డి , స్థానిక ప్రజా ప్రతినిధులు ఏ. దొరయ్య, ఉప్పులూరి సూరిబాబు, వివిధ గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు, సంబంధిత మండలాల ఆర్ బి కే స్థాయి పశు వైద్యశాల అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

విశాలాంధ్ర కొవ్వూరు : తెలంగాణాకంటే అందనంగా ఆంధ్రాలో అంగన్వాడీలకు వేతనాలు చెల్లిస్తానన్న జగన్ హామీని అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగ న్వాడీలకు గ్రాడ్యుటీ ఇవ్వాలని,టిఏ బిల్లులు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన సమ్మె ఆరవ రోజు మండలంలోని వివిధ గ్రామాల్లో కొవ్వూరు వార్డుల్లో అంగన్వాడి సెంటర్ నందు లబ్ధిదారులతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద లబ్ధిదారులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మాణిక్యమ్మ మాట్లాడారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కొవ్వూరు ప్రాజెక్టు నాయకులు వసంతాడ శ్రీదేవి చీర దుర్గాభవాని బందలపాటి పద్మజ ఆలమండ నరసమాంబ నేతల శాంత కుమారి వేలంగి మధురవల్లి దమ్ము అమరావతి తదితరులు నాయకత్వం వహించారు.

బదిలీల సీఎం..జగన్

గిడుగు ఎద్దేవా

విశాలాంధ్ర - అమలాపురం : కలెక్టర్లను బదిలీ చేయడం తెలుసు..ఎస్పీలను బదిలీ చేయడం తెలుసు. కానీ రాష్ట్రంలో జగన్ కొత్తగా ఎమ్మెల్యేల బదిలీ కార్యక్రమం చేపట్టారని పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఎద్దేవా చేశారు. ఒక నియోజక వర్గంలో చెల్లని రూపాయి, వేరే నియోజక వర్గంలో ఎలా చెల్లుబాటు అవుతుందో జగన్ చెప్పాలన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ పెర్ఫార్మెన్స్ ఉంటుంది. ఇక్కడేమో ఎమ్మెల్యేలను చూడడం ఏమిటో అన్నారు. రాష్ట్రం వైసీపీ పాలన అంతా మాఫియాలతో స్కాంలతో నిండి పోయిందన్నారు. నిత్యం కోట్లాది రూపాయల నగదు మద్యం షాపుల నుంచి ఎవరెవరికి వెళుతుందో గుర్తించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అన్నారు. సమావేశంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబీ, అయితాబత్తుల సుభాషిని, కుడుపూడి శ్రీను, ఎండి ఆరిఫ్ దోనిపాటి, వికాయలక్ష్మి, గెద్దం సురేష్ బాబు, రెడ్డి బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో మరింత ముందుకు వెళతా

-కుంచె రమణారావు

విశాలాంధ్ర - అమలాపురం : కష్టాలు కన్నీళ్లు ఎదుర్కొంటున్న అభాగ్యులకు అండగా నిలబడి ప్రజా సేవలో మరింత ముందుకు వెళతానని, ఎలాంటి ఒడిదుడు కుల్లోనైనా ప్రజలను ఆదుకునేలా గుడ్ సీడ్ ఫౌండేషన్ తరపున కార్యక్రమాలు రూపొందిస్తామని, గుడ్ సీడ్ ఫౌండేషన్ అధ్యక్షులు వైఎస్ఆర్ వైఎస్ఆర్సిపి సీనియర్ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కుంచె రమణారావు తెలిపారు. శుక్రవారం తన పుట్టినరోజు మరియు గుడ్ సీడ్ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అమలాపురం నియోజకవర్గంలో ఉన్న వికలాంగులకు ట్రై సైకిల్స్, మహిళలకు కుట్టు మిషన్లు, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఫిక్సిడ్ డిపాజిట్లు అందించి 400 మంది పైగా యువకులు రక్తదానం, వృద్ధులు, వితంతువులకు మరియు సేవా తత్పరులకు వస్త్ర దానం చేసి, క్రీడాకారులకు క్రీడా సామాగ్రి, జర్నలిస్టులకు ఒక్కొక్కరికి 10 లక్షలకు పైగా జీవిత భీమా బాండ్లు రమణారావు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అమలాపురం ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, విజయవాడ డిసిపి మోకా సత్తిబాబు, తహసిల్దార్ జవ్వాది వెంకటేశ్వరి హాజరయ్యి రమణారావు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ పేద వర్గాల ప్రజలను ఆదుకుని వారి బాధలను అర్థం చేసుకొని తన సంపాదనలో కొంత సగం పైగా కేటాయించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని, తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేశానని తెలిపారు. అనంతరం తన పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి పంచారు. ఈ కార్యక్రమంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు రమణారావు, అభిమానులు, నియోజకవర్గ ప్రజలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, 15 వేల మందికి పైగా పెద్ద ఎత్తున తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

పేద విద్యార్థులకు చిక్కం ట్రస్ట్ ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి సిఎస్ఎం మరియు యంఎస్వై కళాశాలలో ఇంటర్మీడి యట్ విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థు లకు చిక్కం సరస్వతి భాస్కరరావు చారి టబుల్ ట్రస్ట్ అమలాపురం వారి ట్రస్ట్ సభ్యుల చేతుల మీదుగా ప్రోత్సాక నగదు చెక్కులు ట్రస్ట్ సభ్యులు డాక్టర్ సిపి నాగేశ్వరరావు చేతులు మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.2000 చొప్పున మొత్తం ఐదుగురు విద్యార్థులకు పదివేల రూపాయలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గొల్లవల్లి సిఎస్ఎం కళాశాల ప్రిన్సిపల్ కె బాలాజీ, సెక్రెటరీ సిహెచ్ ప్రసాద్, ట్రెజరర్ ఎం సుబ్రహ్మణ్యం, ట్రస్ట్ సభ్యులు చిక్కం సత్యనారాయణమూర్తి ఉన్నారు.

మొదలైన శ్రీరుద్రసహస్ర చండీ సహిత రాజశ్యామలాయాగము

విశాలాంధ్ర - పిఠాపురం : రాష్ట్రానికి పట్టిన దుష్ట అరిష్ట గ్రహాలన్నీ తొలగిపోవాలని శ్రీరుద్ర సహస్రచండీ సహిత రాజశ్యామలాయాగ నిర్వహిస్తున్నామని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం మాధవపురం రోడ్ వైష్ణవి గార్డెన్స్‌లో శ్రీరుద్రసహస్ర చండీ సహిత రాజశ్యామలాయాగమును 17వ తేదీ నుండి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరు కుంటూ యాగం చేస్తున్నామని రామచంద్రయాదవ్ అన్నారు.

రాష్ట్రానికి మళ్లీ జగనే సీఎం కావాలి

దేవరపల్లి బహిరంగ సభలో ఎంపీలు, ఎమ్మెల్యేలు వెల్లడి

విశాలాంధ్ర - దేవరపల్లి : రాష్ట్రంలో తిరిగి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని నినాదంతో దేవరపల్లిలో భారీ స్థాయిలో బహిరంగ సభలో నినాదాలు ఓరు ఎత్తింది గోపాలపురం నియోజకవర్గంలో దేవరపల్లిలో ఆదివారం సాయంత్రం సామాజిక సాధికారిక బస్సు యాత్రలో భాగంగా దేవరపల్లి ఎమ్మెల్యే కార్యాలయం సమీపంలో హైవేపై ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన వేణుగోపాల్, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీలు మార్గాన్ని భరత్ రామ్, నందిగం సురేష్ గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చింతలపూడి ఎమ్మెల్యే ముక్తకంఠంగా మాట్లాడుతూ రాష్ట్రానికి మంచి భవిష్యత్తు కావాలంటే తిరిగి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. గత నాలుగున్నర సంవత్సరాల నుండి రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు జరిగాయని తెలిపారు. గోపాలపురం నియోజకవర్గంలో 1500 కోట్లతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు జరిగాయని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. గోపాలపురం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో తనను సుమారు 38వేల ఓట్లతో గెలిపించారని తిరిగి మరి అంత మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే తలారి నీ వక్తలు ఆకాంక్షించారు. సభకు ముందుగా సూర్యనారాయణపురం నుండి కార్యకర్తలు నాయకులతో నాయకులు సభా స్థలానికి వచ్చారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటలకు దేవరపల్లిలో లైటింగ్ సిస్టమును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసి చైర్మన్ రావు ఎంపీపీలు కెవికె దుర్గారావు ఉండవెల్లి సత్యనారాయణమూర్తి బంక జయలక్ష్మి జడ్పిటిసిలు పొట్టి స్వర్ణలత కే లలిత గోపాలపురం నియోజకవర్గం వైసీపీ పరిశీలకుడు గన్నమణి వెంకటేశ్వరరావు మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ ఎస్ కే భాష మేడిపోయిన గంగరాజు గోపాలపురం నియోజకవర్గం నుండి వైసీపీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జీకి ఘన నివాళి..

విశాలాంధ్ర.గోకవరం : ఉపాధ్యాయ ఉద్యమంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకొని ఎమ్మెల్సీగా ఎదిగిన షేక్ సాబ్జి అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం తూర్పుగోదావరి జిల్లా శాఖ అధ్యక్షులు డేనియల్ బాబు అన్నారు. శనివారం నాడు గోకవరం మెయిన్ పాఠశాల నందు జరిగిన మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ షేక్ సాబ్జి కి ప్రగాఢ సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. గోకవరం మండలం ఎస్టియు నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా సిహెచ్ చిన్న వీర్రాజు, అధ్యక్షులుగా కత్తుల వీర్రాజు, ప్రధాన కార్యదర్శిగా కారం కుమారి, ఆర్థిక కార్యదర్శిగా కె రామచంద్రుడు, మహిళా కార్యదర్శిగా ఆర్ కృష్ణవేణి, అభయ్ కన్వీనర్ గా సిహెచ్ రాజ్ కుమార్, ఉపాధ్యాయ వాణి కన్వీనర్‌గా కే రామకృష్ణ, జిల్లా కౌన్సిలర్‌గా ఒ వి రమణ శర్మలు ఎంపికయ్యారు...

పోలవరం నిర్వాసితుల త్యాగం మరువలేనిది

విశాలాంధ్ర. గోకవరం : గోకవరం గ్రామంలో గంగాలమ్మ గుడి సమీపన పోలవరం నిర్వాసితులు చేపట్టిన దీక్ష నాలుగవ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు గోకవరం టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కొరకు సర్వం త్యాగం చేసిన ప్రజల జీవితాలు అగమ్య గోచరంగా మారాయని, వారికి న్యాయం చేయవలసిన బాధ్యత స్థానిక ప్రభుత్వాలపై ఉందని తెలిపారు. పోలవరం నిర్వాసితుల డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నిర్వాసితుల తరఫున టిడిపి నాయకులు డిమాండ్. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మంగ రౌతు రామకృష్ణ,, మాజీ జెడ్పిటిసి పాలూరి బోసు బాబు,తెలుగుయువత అధ్యక్షులు గుండా శివప్రసాద్, యూనిట్ ఇంచార్జ్ పిల్లా చంటి ,నియోజవర్గ ఐటీడీపీ చాంపియన్ ఉంగరాల గణేష్,మండల ఉపాధ్యక్షుడు సిద్ధ సత్యనారాయణ, రాజమండ్రి మణమ్మ, గేదెల చిన సుబ్బారావు, లంకా పోసిరావు,నామా తిరుపతి రాయుడు,తానాల కొండలరావు, రాజమండ్రి నారాయణరావు, దుక్క సుబ్రహ్మణ్యం, సిద్ద వెంకన్నదొర, మడక త్రిమూర్తులు, కోటపతి వెంకన్న, భద్రం, వరలక్ష్మి, మంగరౌతు చందు తదితరులు పాల్గొన్నారు..

నాటి అభివృద్ధిలో భాగస్వాములే నేటి వృద్ధులు

విశాలాంధ్ర - నిడదవోలు : వివిధ రంగాల్లో సేవలందించి దేశ అభివృద్ధిలో భాగస్వాములే నేటి వృద్ధులని వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు అన్నారు. జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా స్థానిక శ్రీ రొంగల అమ్మిరాజు సత్యనారాయణ మున్సిపల్ బీసీ కమ్యూనిటీ హాల్ లో విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు అడబాల నరసింహ కొండల రాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర్య వచ్చిన మొదటి రోజుల్లో ప్రగతి రథచక్రాలను అభివృద్ధి వైపు పయనింప చేసిన నాటి యువకులే నేటి వృద్ధులని వారి ప్రతి అవసరతను తీర్చవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం 75 సంవత్సరములు దాటిన ఎనిమిది మందికి వజ్రోత్సవ వేడుకల్లో సన్మానించిరి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారా యణ, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాసు,ఏపీఈ పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ బలబద్ర వీరభద్రరావు, కార్యదర్శి శింగులూరి వెంకట సత్యనారాయణ,వర్కింగ్ ప్రెసిడెంట్ ఫుల్లూరి రామ మూర్తి, కార్యాలయ కార్యదర్శి అడపా సూర్య చంద్రరావు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకార కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ స్పందన హాలులో ఉదయం 9.30 గంటల నుంచి జరుగుతుందని జిల్లా కలెక్టరు డా కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు.

రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం

విశాలాంధ్రం-దేవరపల్లి: రాష్ట్రంలో పేద బడుగు బలహీన మైనారిటీ బీసీ ఎస్టీ సామాజిక వర్గాలకు సమన్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదని తూర్పుగోదావరి జిల్లా ఇన్చార్జ్ మంత్రి రాష్ట్ర సమాచార శాఖ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. దేవరపల్లి మండలంలో ఎర్నగూడెంలో సూర్యనారాయణపురం వద్ద సమావేశంలో ఆదివారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో రెండు లక్షల 64 వేల కోట్ల రూపాయలతో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేనినని చెల్లుబోయిన అన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సు యాత్ర ఎంతో చారిత్రార్థకమైనదని ఇచ్చిన హామీలను వంద రోజులలో అమలు జరిపిన ఘనత జగన్మోహన్ రెడ్డి అన్నారు రాష్ట్రంలో ఎటువంటి అవినీతి లేకుండా లబ్ధిదారులకు వాలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని తలారి తెలిపారు ఈ సమావేశంలో వైసీపీ నేతలు మేడిపోయిన గంగరాజు జడ్పిటిసి పొట్టి స్వర్ణలత నరహరిశెట్టి రాజేంద్ర బాబు బొంత భరత్ బాబు గడ రాంబాబు ఆచంట సురేష్ చెలికాని రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పథకాలు ప్రమాణాలను పెంచుతాయి

విశాలాంధ్ర కొవ్వూరు : చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి బూరుగు పల్లి వీర రాఘవరావు అన్నారు. వాడపల్లి ఎస్సి పేటలో ఆదివారం ఇంటింటికి తిరిగి భవిష్యత్తు గ్యారంటీ మేనిఫెస్టో వివరించారు. చంద్రబాబు నాయుడు పథకాలు వివరిస్తూ మహిళా శక్తి పథకం యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయని ఆయన పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను వివరించారు. ఈ కార్య క్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ పింఛనుదారుల దినోత్సవం

విశాలాంధ్ర - కాకినాడ : పింఛను పొందడం ప్రాథ మిక హక్కు. ఏళ్ల తరబడి జీవితాన్ని వృత్తికే అంకితం చేసిన అనంతరం శేష జీవితాన్ని ఆనందంగా గడిపేందుకు సామాజిక భద్రత రీత్యా పింఛను పొందడం ఒక ప్రాథమిక హక్కు అని విద్యుత్ శాఖ విశ్రాంతి సూపరింటెంటింగ్ ఇంజనీర్ అద్దాల వీరభద్రరావు పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ పింఛనుదారుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఇది ఎవరి దయాదాక్షిన్యాల పై ఇచ్చేది కాదని సుప్రీంకోర్టులో 1980లో విశ్రాంతి ఉద్యోగి నకారా కేసు వేశారని తెలిపారు. ఈ సందర్భంగా అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో పింఛనుదారులైన అద్దాల వీరభద్రరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, డాక్టర్ అద్దాల సత్యనారాయణ, న్యాయవాది ఎను ముల రామం, యస్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

చదవటం మాకిష్టం-సండే స్టోరీ టైం

విశాలాంధ్ర - కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యం లోని కాకినాడ కుళాయి చెరువు పార్క్‌లో గల గాంధీ నగర్ శాఖ గ్రంథాలయంలో 17-12-2023 ఆదివారం పాఠశాల విద్యార్థులతో చదవటం మాకిష్టం-సండే స్టోరీ టైం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాకినాడ రామారావు పేట, నగరపాలక సంస్థ విద్యార్థులు పి భాగ్యశ్రీ, పి భవ్యశ్రీ, కే ప్రవల్లిక అల్లావుద్దీన్ అద్భుతదీపం, నమ్మిన వారిని మోసం చేయకు, మీ శరీరం తదితర పుస్తకములను చదివి వినిపించడం జరిగింది. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు కథలు చదవడం, కథలు వినడం ద్వారా భావవ్యక్తీకరణ చేయడం అలవడుతుందని అన్నారు.

బాబు ప్రపంచ దేశాలతో పోటీ పడితే జగన్ బీహార్‌తో పోటీ పడుతున్నారు?

- యువత పట్ల జగన్ హామీలన్నీ నీటమూటలే
- తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల విమర్శ

విశాలాంధ్ర - రాజానగరం : నాటి చంద్రన్న పాలనలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రపంచ దేశాలతో పోటీ పడి యువతకు ఉద్యోగావకాశాలు అందిస్తే నేటి సీఎం జగన్ పాలనలో బీహార్ రాష్ట్రంతో పోటీ పడి యువత జీవితాలను అంధకారంలోకి తోసేశారని తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు అన్నారు.ఈ సందర్భంగా విశాలాంధ్రతో చారవాణిలో ఆదివారం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో పట్టభద్రుల నిరుద్యోగంలో రాష్ట్రం అత్యంత వెనుకపడిన బీహార్ ను అధికమించి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడం బాధాకరమని ఆరోపించారు. ప్రతి ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని జగన్ చెప్పిన కల్లబొల్లి హామీలన్నీ నీటమూటలాగా మిగిలాయని విమర్శించారు. తాను అధికారంలోకి రాగానే వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 2,30,000 ప్రభుత్వ ఉద్యోగా ల్ని భర్తీ చేస్తామంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జగన్, 2019లో అధికారంలోకి రాగనే వాటిని గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. ఇప్పటివరకు దళిత, బీసీ, మహిళా, సీపీఎస్, కార్మిక ద్రోహిగా ముద్రపడ్డ సీఎం తాజాగా నిరుద్యోగ ద్రోహిగా ఖ్యాతి గడించారని మండిపడ్డారు. ఒక్క అవకాశం అని అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజల్ని వంచించిన వ్యక్తిగా జగన్ చరిత్రలో నిలిచిపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో దాదాపు 77,96,889 ఉపాధి హామీ కార్డులను జగన్ ప్రభుత్వం తొలగించిందని కేంద్రమంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి ఇటీవలే వెల్లడించిన వ్యాఖ్యలను సమర్థిస్తునట్లు చెప్పారు. ఏపీలో యువతకు సరైన ఉన్నత ఉద్యోగావకాశాలు లేక పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగులకి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎస్పీ శ్రీధర్‌కు డీజీపీ డిస్క్ అవార్డు

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతల విభాగంలో 2022 సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ నుండి అడిషనల్ డీజీ స్థాయి అధికారులకు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కె రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం డిజిపి ప్రధాన పోలీస్ కార్యాలయం మంగళగిరిలో డీజీపీ డిస్క్ అవార్డుల ప్రధానం చేశారు. ఇందులో భాగంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్ శ్రీధర్ క్షేత్రస్థాయిలో శాంతిభద్రతల విభాగంతో పాటు దిశ, కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అందించిన సేవలను గుర్తించిన డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి డిజిపి డిస్క్ అవార్డును ప్రధానం చేసి ప్రత్యేకంగా అభినందించారు.

కిడ్నీ వ్యాధుల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ కె.ప్రదీప్

విశాలాంధ్ర కొవ్వూరు : కిడ్నీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాజమండ్రికి చెందిన ప్రముఖ కిడ్నీ వ్యాధి నిపుణులు కే ప్రదీప్ అన్నారు. ఆదివారం స్థానిక పట్టణంలోని వాటర్ ట్యాంక్ సమీపంలో యువ నాయకుడు గండ్రోతు పవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో రాజమండ్రికి చెందిన లోటస్ ఆసుపత్రి వైద్యులు ప్రదీప్ వైద్య సేవలు అందించగా వైద్య సిబ్బంది 9మంది సహకరించారు. శిబిరానికి హాజరైన రోగులకు బిపి, షుగరు టెస్టులు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ శిబిరంలో మోటార్ మెకానిక్ యూనియన్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆయాలే అన్నం పెట్టాలి

విశాలాంధ్ర - తాళ్ళపూడి : అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ సచివాలయ సిబ్బంది, డ్వాక్రా సిబ్బంది, వలేంటీర్లకు అప్పగించటం పట్ల ఆయా కేంద్రాలలో పిల్లల తల్లులు, విద్యార్థులు అంగన్వాడీ టీచర్లె కావాలి, ఆయాలే అన్నం పెట్టాలి అని నినాధాలు చేస్తున్న సంఘటన లు వెలుగులోకి వస్తున్నాయి. ఈ మేరకు తాళ్ళపూడి మండలం మలకపల్లి సెంటర్ లో ఈ విధానం కనపడింది.

ఇసుక అక్రమ మైనింగ్‌పై స్పందించని అధికారులు

విశాలాంధ్ర - సీతానగరం: రాత్రింబవళ్ళు యద్దేచ్ఛగా అక్రమ ఇసుక మైనింగ్ జరుగుతున్న ఏ ఒక్క అధికారి స్పందించడం లేదు అని లాయర్ చిడిపి నకుల సురేష్ ఆరోపిం చారు. నకుల సురేష్ విలేకరులతో మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా యాద్దేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా మండలంలో గల మునికుడలి, రాజంపేట గ్రామాల మధ్య ప్రక్కిలంక సర్వే నెంబర్లలో జరుగుతున్నప్పటికీ పిర్యాదు చేసినప్పటికీ ఏ ఒక్క మండల, జిల్లా అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదని అన్నారు. గత ఏడాది ఫిర్యాదు మేరకు ర్యాంపులో తనిఖీ చేసి ఇది మా పరిధి కాదు ఏలూరు మైనింగ్ సంబంధించినదని చేతులు దులిపేసుకున్నారని అన్నారు. అక్రమ మైనింగ్ చేయడం వల్ల పర్యావరణ హానితో పాటు నదీ ప్రవాహ స్థితిలో మార్పు జరిగి భవిష్యత్ తరాలకు అనేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ అక్రమ మైనింగ్ పై అధికారులు స్పందించకపోతే జాతీయ దర్యాప్తు సంస్థలైన ఈ డి, సి ఐ డి వంటి సంస్థలకు ఫిర్యాదు చేసి దర్యాప్తు జరిగేలా చూస్తానని అన్నారు. అలాగే ఉన్నత న్యాయస్థానాల ద్వారా న్యాయ పోరాటం చేస్తానని అన్నారు. కొసమెరుపు ఏమిటంటే ఇసుక అక్రమ మైనింగ్ జరుగుతున్నప్పటికీ మైనింగ్ శాఖ అధికారులు సీతానగరం మండలంలో ఏ విధమైన ఇసుక అక్రమ మైనింగ్ జరగడం లేదంటూ అర్ టి యే ఎక్ట్ ద్వారా అడిగిన ప్రశ్నకు రాత పూర్వకంగా సమాధానం ఇచ్చారు అని అన్నారు.

రైల్వే అడ్వైజరీ బోర్డు సభ్యులుగా బొమ్ముల

విశాలాంధ్ర - రాజానగరం : రైల్వే అడ్వైజరీ బోర్డు సభ్యు లుగా మండలంలోని హౌసింగ్ బోర్డుకి చెందిన బొమ్ముల సతీష్ నియామకం అవ్వడం హర్షణీయమని పలువురు బీజేపీ పెద్దలు అన్నారు. విజయవాడ డివిజన్ పరిధిలోని కడియం రైల్వే స్టేషన్ కి స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా నియమిస్తున్నట్లు రైల్వే శాఖ సెంట్రల్ గవర్నమెంట్ నుండి ఉత్తర్వులు విడుదల య్యాయి. బీజేపీలో అనేక పదవులు అలంకరించిన సతీష్ నూతనంగా రైల్వే అడ్వైజరీ బోర్డు సభ్యులుగా ఎన్నికవ్వడంతో పలువురు శుభాకాంక్షలు తెలిపారు. బొమ్ముల సతీష్ విశాలాంధ్రతో ఆదివారం మాట్లాడుతూ తన భుజ్కంధాలపై పెట్టిన బాధ్యతలను సక్రమంగా వినియోగిస్తానని, స్టేషన్ అభివృద్ధికి తమ వంతు మరింత సేవలు అందిస్తామని చెప్పారు. పార్టీ అభివృద్ధికి రానున్న ఎన్నికల్లో విజయపరంపర సాధించేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. దీనిలో భాగంగా తనకి పదవి రావడానికి కారణమైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి, బిజెపి కేంద్ర కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షులు బొమ్ముల దత్తు, రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి,కో-కన్వీనర్ అడబాల గణపతికి హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.అనంతరం స్టేషన్ మాస్టర్ మేడిచర్ల గంగా ప్రసాద్ చేతులు మీదుగా డిక్లరేషన్ ఫారం అందుకున్నారు.

వైసీపీ టికెట్ ఇచ్చిన అభ్యర్థిని గెలిపించాలి

-రఘురామ్

విశాలాంధ్ర - జగ్గంపేట : ఇక్కడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏ అభ్యర్థిని ఎవరిని నిలబెట్టిన జగనే పోటీ చేస్తున్నారు అన్నట్లుగా ఆ అభ్యర్థిని గెలిపించు కోవాల్సిన భాధ్యత మనందరిపైనా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ జనరల్ సెక్రటరీ ఒమ్మి రఘురామ్ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. జగ్గంపేటలో ఆదివారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. 2014, 2019 ఎన్నికల్లో ఏవిధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలిపించుకున్నామో అదే తరహాలో జగ్గంపేట నియోజకవర్గంలో మనందరి కృషితో, కష్టంతో, ప్రజల మద్దతుతో జగనన్న నేతృత్వంలో 2024లో గెలిపించి హ్యాట్రిక్ సాధించు కోవాలన్నారు. జగ్గంపేట అభ్యర్థి ఎవరైనా జగనన్నే ఇక్కడ పోటీ చేస్తున్నారని భావించి పార్టీ మనుషులుగా అందరూ కొనసాగాలని కోరుతున్నా నన్నారు. మన పార్టీలో నాయకుల కన్నా కార్యకర్తలే నిజమైన బలం అని మీకు తెలియజేస్తూ, భవిష్యత్‌లో కష్ట పడ్డ ప్రతి నాయకునికి, కార్యకర్తకు మేలు జరుగుతుందని తెలియజేస్తున్నానన్నారు. వ్యక్తుల పట్ల కాక, పార్టీ పట్ల నిబద్దతతో ఉండాలని ఆయన కోరారు.

నేడు మెగా ఆరోగ్యశ్రీపై అవగాహన

విశాలాంధ్ర ఏలూరు: ముఖ్యమంత్రి జగన్ వర్చువల్‌గా ప్రారంభించుచున్న మెగా ఆరోగ్యశ్రీ అవగాహన కార్యక్రమంలో భాగంగా నేటి ఉదయం గం.10.30 లకు ఏలూరు కలెక్టరేట్ లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డా.వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయ కర్త శాఖాధికారి డా. ఐ.రాజీవ్ తెలిపారు. డా.వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ వైద్యఖర్చు రూ.5లక్షల నుంచి 25 లక్షల వరకు వర్తింప చేసే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్, నగర మేయర్ షేక్ నూర్జాహాన్ పెదబాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

పోడూరులో కాపు కల్యాణ మండపానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - పోడూరు: పోడూరులో నిర్మిస్తున్న కాపు కళ్యాణ మండపానికి ఆచంట శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథ రాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. కాపు కల్యాణ మండపం నిర్మాణానికి రూ. 25 లక్షల నిధులను ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు మంజూరు చేసినందుకు శ్రీకృష్ణదేవరాయల కాపు సంఘం అధ్యక్షులు, జద్దు చిన జోగేశ్వరరావు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు. ఎంపీపీ సబ్బితి సుమంగళి, సర్పంచ్ ఎస్ సువర్ణరాజు, వైస్ ఎంపీపీ ఐ సీతారామరాజు, వైసీపీ నాయకులు చేకూరి సూరిబాబు, పోడూరి సాయి, ఆర్ శివాజి రాజు, కాపు సంఘం సభ్యులు రాయుడు నాగరాజు, ఉగ్గిరాల కాశయ్య, రేకపల్లి నాగరాజు , బ్రహ్మం కోలా సత్యనారాయణ, రాట్నాల నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పొట్టేళ్ల బండితో జీవనం

విశాలాంధ్ర - పెంటపాడు : గుర్రపు బండ్లుచూశాం, ఎడ్ల బండ్లు చూశాం, కానీ గొర్రె పొట్టేలు బండి తక్కువమంది చూసి ఉంటారు. ఆదివారం పెంట పాడు గ్రామ శివాలయం దగ్గరలో 75 సం"లు కలిగిన వృద్ధుడు గొర్రె పొట్టేలు బండిని తోలుకు రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ విషయమై ఆ వృద్ధున్ని వివరాలు కోరగా అతనిది కృష్ణా జిల్లా, బాపులపాడు మండలం,వీరవల్లి గ్రామం,అతని పేరు అమృతపల్లి బాపూజీ,అతనికి భార్య ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారని వారికి వివాహాలు చేసి పంపించానని, సంసార బాధ్యతల రీత్యా పిల్లలు ఎవరి కుటుంబాన్ని వారు పోషించుకునే క్రమంలో నేను నా భార్య ఒంటరిగా ఉండడంతో, బ్రతుకుతెరువు కష్టతరం కావడంతో, పొట్టేలు బండి మీద జీవనం సాగిస్తున్నామని తెలిపారన్నారు. ఏ ప్రాంతంలో తిరునాళ్లు జరిగిన అక్కడకు నా పొట్టేలు బండితో వెళ్తానని, ప్రస్తుతం అత్తిలి లో జరిగే సుబ్రహ్మణ్య షష్టి తిరునాళ్లకు వెళ్తున్నానని,ఆ షష్టికి వచ్చే వారి సందర్శనార్థం పొట్టేలు బండిని పెడతానని,జనాలు బండి పైకి ఎక్కి ఫోటోలు దిగుతారని,అలా ఫోటో దిగిన వారి వద్ద నుండి టికెట్ ధర రూ.20లు తీసుకుంటానని,ఈ టికెట్ ద్వారా వచ్చే డబ్బులతో నా కుటుంబాన్ని పోషించుకుంటున్నానని తెలిపాడు. ఈ వయసులో కూడా ఆత్మాభిమానంతో పిల్లలపై ఆధారపడకుండా సుదూర ప్రాంతాలకు తిరుగుతూ,తన పని తాను చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకోవడం ఈనాటి యువతకు సవాల్ విసిరినట్టే నని గ్రామస్తులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం

విశాలాంధ్ర, వీరవాసరం: మండలంలోని రాయకుదురులో వేంచేసి ఉన్న శ్రీ ఉమా మూలేశ్వర స్వామి వారి దేవస్థానం శివాలయంకు ఉప ఆలయం అయిన శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణం ఆలయ చైర్మన్ కాయల నానిబాబు, అనంత ఈశ్వర లక్ష్మీతాయారు దంపతులచే ఆలయ అర్చకులు శంకరమంచి రఘురాం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం విశేష ద్రవ్యాలతో ఘనంగా అభిషేకాలు చేసి నూతన వస్త్రాలు అలంకరించి పెండ్లి కుమారుని చేశారు. స్వామి, అమ్మవార్లను పలువురు భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కళ్యాణం సందర్భంగా స్వామి వారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులకు ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా ఆలయ చైర్మన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు

సాబ్జి మృతి తీరని లోటు

విశాలాంధ్ర, వీరవాసరం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అవిశ్రాంత పోరాటం చేసిన ఎంఎల్సీ షేక్ సాబ్జి మృతి తీరని లోటని యూటీఎఫ్ నాయకులు అన్నారు. ఉపాధ్యాయ ఉద్యమ నేత, ఎంఎల్సీ షేక్ సాబ్జి సంతాప సభను స్థానిక యూటీఎఫ్ భవనంలో ఆదివారం నిర్వహించారు. సాబ్జి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. సాబ్జీతో ఉన్న అనుబంధాన్ని ఉపాధ్యాయులు బాధాతప్త హృదయంతో వ్యక్తపరిచారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిహెచ్.కుమార్ బాబ్జీ, ప్రధాన కార్యదర్శి ఎం ఎం ఎస్ సిహెచ్.శ్రీనివాస్, మాజీ ఎంపిపి జుత్తిగ నరసింహమూర్తి, జీవివి. రామానుజరావు, డి.పుల్లారావు, ఎన్.ప్రసాద్ బాబు, పి.సాయిబాబా,ఎ.గోవిందరాజులు, గుబ్బల శ్రీలక్ష్మి, కె.రామకృష్ణ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు

విశాలాంధ్ర - కైకలూరు : కైకలూరు 113వ బూత్,ఆచవరం 138 వ బూత్,వింజరం వ బూత్ లలో మండల టిడిపి అధ్యక్షులు పెన్మేత్స త్రినాథ్ రాజు,క్లస్టర్ -5 పోలవరపు లక్ష్మీరాణి,ఆగోల్లు భలే స్వామి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భముగా నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ - జనసేన పార్టీ పర్యవేక్షణలో 2024 లో తెలుగుదేశం పార్టీ- జనసేన పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే పథకాలు బాబు ష్యూరిటీ -భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో మహిళలకు భవిష్యత్తుకు గ్యారెంటీ - ఇది బాబు గ్యారెంటీ హామీ పత్రాలను అందించారు. మాజీ జడ్పీటీసీ బొమ్మన బోయిన విజయలక్ష్మీ,ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు వీరమల్లునరసింహారావు,వీరాబత్తిన సుధ,మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పి.రాధకృష్ణ,వింజరం గ్రామ టిడిపి అధ్యక్షులు పెడసనగంటి మల్లేశ్వరరావు,బొద్దుల భాస్కరరావు,ఆకునూరి సంగీతరావు,అచవరం మాజీ వైస్ సర్పంచ్ జంగం వెంకటరాజు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని జనసేన మండల అధ్యక్షుడు అడపా నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెకు ఆదివారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ లకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేయాలని, ఐసిడిఎస్ బడ్జెట్ పెంచాలని, ప్రీస్కూల్స్ బలోపేతం చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లో నిబంధనలు పాటించి ప్రమోషన్ వయస్సు 50 సంవత్స రాలు పెంచాలని, సర్వీసు లో వుండి చని పోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం భీమా ఇవ్వాలని, వైఎస్ ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని,గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మద్యాహ్నాపు చిన పెంటా రావు, తోట సాయి, ఆళ్ళ బాలాజీ, దాసరి పుల్లా రావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి లేదు

మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య

విశాలాంధ్ర చాట్రాయి: 5 లక్షలఎత్తిపోతలపై ఎకరాలకు సాగునీరు అందించే చింతలపూడి ఎత్తిపోతల పథకం పై స్థానిక శాసనసభ్యులకు శ్రద్ధ ఏదని నూజివీడు మాజీ శాసనసభ్యులు చిన్నం రామకోటయ్య ప్రశ్నించారు. ఆదివారం సాయంత్రం చాట్రాయి గ్రామంలోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత నేత స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం కార్యక్రమాన్ని ప్రారంభించారని దానిని చంద్రబాబు కాలంలో మరింత పెంచి ఫేజ్ టూ పేరుతో భూములు సేకరించి కాలువలు తవ్వారని ఆ తర్వాత ముఖ్యమంత్రిగా వచ్చిన జగన్ కాలంలో పథకంలో ఒక తట్ట మట్టి కూడా తీయలేదన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి నూజివీడు వచ్చిన సందర్భంగా లక్షలాది మందితో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభిస్తామని మాట్లాడారని గుర్తు చేశారు. వివిధ పత్రికలలో పతాక శీర్షికతో వార్తా కథనాలు వచ్చాయని పత్రికలను చూపించారు. ముఖ్య మంత్రి నూజివీడు వచ్చి వెళ్లి నెల రోజులు దాటినా దాని ఊసెత్తడం లేదన్నారు. మంత్రి పని ఒత్తిడిలో మరిచిపోతే స్థానికంగా ఉన్న నాయకులు గ్రామాల్లో ఉన్న నాయకులు ముఖ్యమంత్రి కి గుర్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరు గుర్తు చేసిన దాఖలాలు లేవన్నారు. అందుకే తాము జగనన్నకు గుర్తు చేస్తామని కార్యక్రమాన్ని ప్రారంభించి ఈనెల 21వ తేదీన సూరంపాలెం నుంచి చీపురుగూడెం వరకు కాలవపై ప్రత్యేకమైన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక రైతులు ప్రజలు కార్యక్రమానికి మద్దతు నివాళి అన్నారు. ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోపు ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తే తాను ఎమ్మెల్యేగా పోటీ చేయడం మానేస్తానన్నారు. తాను ఎంఎల్ఏ గా పోటీ చేయాలనుకునేది ప్రజా సమస్యలను చట్టసభలో ప్రస్తావించడానికే అన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించనప్పుడు రానున్న ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు వారికి లేదని నీ ఓటు కోసం వచ్చే వారిని ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తయ్య వరకు ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలు చేస్తూ ప్రజలకుఅండగా నిలుస్తానన్నారు. కార్యక్రమంలో చాట్రాయి మాజీ సర్పంచ్ కే జోషి, చిన్నంపేట మాజీ సర్పంచ్ కునికేరి నాగ మల్లేశ్వరరావు, చీపురుగూడెం మాజీ ఎంపీటీసీ మేకల చందు ,చిన్నంపేట మాజీ ఎంపీటీసీ కలపాల రమేష్, నరసింహారావు పాలెం మాజీ ఎంపీటీసీ సుబ్బారెడ్డి, వివిధ గ్రామాల రామ కోటయ్య అభిమానులు రామకోటయ్యకు తీన్మార్ దరువులతో స్వాగతం పలికారు.

పాస్టర్లు ఇశ్రాయేలు,సాల్మన్ రాజులకు సన్మానం

విశాలాంధ్ర పెంటపాడు: మండలం చింతపల్లి గ్రామంలో చింతపల్లి క్రిస్టియన్ యూత్ వారి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిపారు. ముఖ్య ప్రసంగీకులుగా డబ్ల్యూ.సి.ఎమ్.కిరణ్ పాల్(గుడివాడ) క్రిస్మస్ సందేశాన్ని ఇవ్వగా,గాయకుడు చిన్ని సవరపు క్రిస్మస్ పాటలతో విశ్వాసులను ఉత్సాహపరిచారు. సురగాల ఇశ్రాయేలు(ఆర్.సి.యం ఉపదేశి)మల్లిపూడి సాల్మన్ రాజు(జెకర్యా ప్రార్ధన మందిరం)లను,సి సి ఎస్ సభ్యులు చదలవాడ కిరణ్(బ్లెస్సింగ్ ప్రేయర్ మినిస్ట్రీ), తిపరాళ్ల మురళి(పరిశుద్ధ ప్రార్ధన సహవాసం), పెద్దలు బైపే రామకృష్ణ, గాది కోదండం, తాతపూడి రవిలు, పూలమాలలు వేసి,శాలువాలతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. పాస్టర్ ఇశ్రాయేలు, సాల్మన్ రాజులు, మాట్లాడుతూ క్రీస్తు జననం ద్వారా ప్రపంచ మానవాళికి రక్షణ లభించి ందని, జనులందరూ రక్షింపబడాలని యేసు సాధారణ మానవులైన మరియ గర్భాన మనిషి రూపంలో జన్మించి,దేవునిగా,చనిపోయిన వారిని లేపాడని, గుడ్డివారికి చూపునిచ్చాడని, మూగవారిని మాట్లాడించాడని, ఎన్నో అద్భుత కార్యాలు చేసి, మన పాప విమోచన కొరకు, ఆఖరికి శిలువలో తన ప్రాణాన్ని ఇచ్చాడని గుర్తు చేశారు. ఈ వేడుకలో చింతపల్లి విశ్వాసులు పాల్గొన్నారు.

173 లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

విశాలాంధ్ర, ఆచంట: కరుగోరు మిల్లిగ్రామంలో శనివారం ఓ టి ఎస్ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ కార్యక్రమంజరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొని సుమారు 173 మంది లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకున్న వారందరికీ ఆ ఇంటిపై హక్కు కల్పించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ వన్ టైం సెటిల్మెంట్ విధానం ప్రవేశపెట్టారని పేర్కొన్నారు.

జేసీఐ పట్టణ అధ్యక్షునిగా పేరిచర్ల

విశాలాంధ్ర -భీమవరం: జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషల్ (జేసీఐ) భీమవరం పట్టణ అధ్యక్షులుగా పేరిచర్ల కృష్ణంరాజు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. అంకాల ఆర్ట్స్ అకాడమీలో జరిగిన జేసీఐ సమావేశంలో ఆదివారం నూతన కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. జెసిఐ అధ్యక్షులు కృష్ణంరాజు మాట్లాడుతూ లీడర్ షిప్ ఆర్గనైజేషన్ అనేది ఎంతో ముఖ్యమని, సేవాకార్యక్రమాలు చేయడానికి ఎన్నో ఆర్గనైజేషన్లున్నాయని, మనిషి ఎదగడానికి ఆర్గనైజేషన్లు తక్కువగానే ఉంటాయన్నారు. నేటి యువత కమ్యునికేషన్ స్కిల్స్ ను పెంపొందించు కోవాలని, మన స్కిల్స్ తోనే మన భవిష్యత్ కు పునాదన్నారు. జేసిఐ మల్టిపుల్ చైర్ పర్సన్ సిహెచ్ కృష్ణంరాజు, జోన్ ప్రెసిడెంట్ కె.కృష్ణ భాస్కర్ , అడ్మినిస్ట్రేటివ్ మెంబర్ జి.మనోహర్, జోన్ వైస్ ప్రెసిడెంట్ బి.వి.మనోజ్ విష్ణు మాట్లాడుతూ భవిష్యత్ లో ఎలా ఎదగాలి అన్నదే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు కృష్ణంరాజును సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్టీఓ జి.సత్యనారయణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, బోండా రాంబాబు, ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, నడిపల్లి మహేష్, నాచు శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు

విశాలాంధ్ర -భీమవరం: ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు కలిగేలాగ సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్‌ను అమలు చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో కూడా ముఖ్యమంత్రి జగన్ ఒపిఎస్ ను అమలు చేసి రాబోయే ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను మెప్పు పొందాలని అదేవిధంగా ఉద్యోగులకి, ఉపాధ్యాయులకి ఇవ్వవల సిన పిఎఫ్‌లోన్లు, సరెండర్ లీవులు, ఎపిజిఎల్ఐ ఫైనల్ పేమెంట్లు మొదలైనవి ఈ పండుగ రోజుల్లో అయినా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి..నారాయణ మాట్లాడుతూ జులై నెల నుండి రావాల్సిన మధ్యంతర భృతిని చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

అంగన్వాడీల వినూత్న నిరసన...

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొయ్యలగూడెం మండల కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ,మినీ వర్కర్స్ నిర్వహిస్తున్న సమ్మె అరో రోజుకు చేరుకుంది.ఆరో రోజు నిరసనలో వినూత్నంగా గాంధీ చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకుని, ఈప్రభుత్వం చేసే అన్యాయం చూడకు సాధించే వరకు సాగు, ఈ ప్రభుత్వం చెప్పే అసత్యాలు నమ్మకు, గెలిచే వరకు పోరాటం ఆపకు, ఆరు రోజులు నుంచి చేస్తున్న, పట్టించుకోని ప్రభుత్వం గురించి మౌనంగానే ప్రశ్నించు అని నినదించరు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్‌లో సిబ్బంది, పిల్లలు బరువులు చూసే వాటితో ఉయ్యాలలో ఊగటం. పిల్లలు ఆడుకునే బాలు, బ్యాట్‌తో ప్రభుత్వ సిబ్బంది ఆడటం చూసాం. అంగన్వాడి సెంటర్లను అధికారులు ఆడుకునే గ్రౌండ్‌గా రాష్ట్ర ప్రభుత్వం తయారుచేసిందని. ఈ ప్రభుత్వ విధానాలు పూర్తిగా ఖండిస్తున్నాం. తాళాలు బద్దలు కొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని క్రిమినల్ కేసులు పెట్టి, శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ అధ్యక్షులు శివ రత్న కుమురి, పి పద్మజ, జె నాగవేణి , అడపా నాగజ్యోతి, సి.హెచ్ సునిత, బొబ్బిలి చిట్టి, కే జ్యోతి, కే మాధవి, పి భాగ్యలక్ష్మి, యమ్ వెంకటలక్ష్మి, యమ్ మంగా,శ్రీదేవి, నుర్జాహన్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం చేరుకున్న శ్రీరాముని అక్షింతల కలశం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : బయ్యనగూడెం గ్రామంలో ఆదివారం అయోధ్యలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరాముని ఆలయ వద్ద నుండి వచ్చిన రాముని అక్షింతలతో ఉన్న కలశం ని గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ వద్ద నుండి శ్రీరాముని భక్తులు రామనామ జపంతో మేళ తాళాలతో భారీ ఊరేగింపుగా గ్రామంలో ఉన్న అన్ని దేవాలయాలను సందర్శించి పెద్ద రాముని ఆలయని కి తీసుకు వెళ్లడం జరిగిందని కలశం,అక్షింతలు జనవరి ఒకటో తేదీ వరకు ప్రత్యేక పూజలు అందుకోవడం జరుగుతుందని తపన ఫౌండేషన్ మండల సేవా ప్రతినిధి ఆరేటి ఏసుబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముసిరెడ్డి. కావ్య నాగశ్రీ, ఎర్రవల్లి బాబురావు, కాటంరెడ్డి. సూర్యనారాయణ, తిరుమల శెట్టి. గంగాధరం,గంట. శ్రీను, రమణ,తుమ్మలపల్లి. అన్నవరం, మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

విశాలాంధ్ర - కలిదిండి: బీసీల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అంద్రాజు. శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని మట్టగుంట గ్రామంలో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. చేసి తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అంద్రాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీ ఓట్లతో గద్దెనెక్కిన జగన్మోహన్ రెడ్డి బీసీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని తెలిపారు. 56 .బిసి కార్పోరేషన్లు ఏర్పాటు చేసి ఈ నాలుగున్నర ఏళ్లలో ఒక్క రూపాయి నిధులు విడుదల చేయలేదని అన్నారు. రాబోయే రోజుల్లో బీసీ సామాజిక వర్గం అంతా తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమలశెట్టి. ఈశ్వర పరశురాముడు, మోకా. వెంకటరమణ, అంద్రాజు. దుర్గాప్రసాద్, కోపనాతి. వీర్ల వెంకయ్య ,నడకుదిటి. వీరాంజనేయులు, అంద్రాజు. పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర అయోధ్య నుండి రామ భక్తులకు అక్షింతలు

విశాలాంధ్ర - కరప : శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర అయోధ్య రామాలయం నుండి శ్రీరామ భక్తులకు అక్షింతలు, కరపత్రాలు, రామాలయం ఫోటోలు మండల రెవెన్యూ గ్రామాలకు పంపించడం జరిగిందని, ఎన్‌పివి రామారావు, రెవెన్యూ మండల కార్యవాహకులు పలివెల శ్రీధర్ పేర్కొన్నారు. రామారావు మాట్లాడుతూ నడకుదురు దుర్గాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి మండల 23 గ్రామాల నుండి రామ భక్తులు విచ్చేసి కరపత్రాలు, ఫోటోలు, అక్షంతలు, తీసుకు వెళ్లడం జరిగిందన్నారు.

ఆదిత్యలో విజయవంతంగా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరం పాలెం ఆదిత్య ఇంజనీరింగ్ ప్రాంగణంలో కాకినాడ జెఎన్‌టియుకె సెంట్రల్ జోన్ పరిధిలోని కళాశాలల "అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ -2023-2024" పోటీలు విజయవంతంగా ముగిశాయి. అత్యధిక విభాగాలలో ఆదిత్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు మెడల్స్ సాధించారు. మెన్ ఉమెన్ మరియు ఓవరాల్ చాంప్‌గా ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల నిలిచింది. బహుమతి ప్రధాన కార్యక్రమంలో ఆదిత్యా విద్యా సంస్థల వైస్ చైర్మన్ డా ఎస్ సతీష్ రెడ్డి, జెఎన్‌టియుకె స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డా జి శ్యామ్ కుమార్‌లు చేతుల మీదగా విజేతలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. డీన్ జేడి వెంకటేష్, ఈవెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జివి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట పట్టణ పరిధిలో అమ్మా న్నమ అపార్ట్మెంట్‌లో ఆదివారం సాయంత్రం బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంను తెదేపా సీనియర్ నాయ కులు బదుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అపార్ట్మెంట్ వాసులకు చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన మినీ-మానిఫెస్టో గురించి బదుగు శ్రీకాంత్ వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మల్లీ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి పలువురు చేరిక

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట పట్టణ పరిధి 9వ వార్డు పెన్షన్ లైన్‌కు చెందిన 60 మంది వైసీపీ కార్యకర్తలు జనసేన పార్టీ పెద్దాపురం నియోజకవర్గ ఇంచార్జి తుమ్మల బాబు సమక్షంలో ఆదివారం సాయంత్రం జనసేన లోకి చేరారు. పార్టీ నాయకులు సరోజావాసు, జానకిరామారావు, మంచెమ్ సాయిబాబులు ఆధ్వర్యంలో ఈ మేరకు పెన్షన్ లైన్లో జనసేన సభ నిర్వహించారు. జనసేనపార్టీ సిద్ధాంతాలను బాబు ప్రజలకు వివరించారు. అధిక సంఖ్యలో దళితులుపాల్గొని జనసేనకు జేజేలు పలికారు.

పోటీతత్వంతో సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం తాళ్ళరేవులో లయన్స్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 316 బి, రీజియన్ 1, జోన్ 3 చైర్మన్ లయన్ బిళ్ళకుర్తి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ నా జోన్ పరిధిలో గల తాళ్ళరేవు, తూరంగి, గొల్లపాలెం, వేళంగి లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో పోటీపడి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అదేవిధంగా శ్రీనివాసరెడ్డి క్లాస్మేట్స్ ఆధ్వర్యంలో కూడా డైమండ్స్ గ్రూప్ ద్వారా తోటీ మిత్రులు కుటుంబ సభ్యులుకు కూడా సహాయ సహకారాలు అందజేస్తున్నా మన్నారు. తాళ్ళరేవు లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీనివాస రెడ్డిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చోడే శ్రీనివాసరావు, నడింపల్లి వినోద్, నున్న దత్తు, సతీష్, ధూళిపూడి బాబి, భగవాన్, కృష్ణమూర్తి, రాయపరాజు, శ్రీధర్, అప్పారావు, కట్టా ఆదినారాయణ, గోపాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సర్వమానవాళికి మార్గదర్శి క్రీస్తు ఏసు ప్రభువే

విశాలాంధ్ర - పెద్దాపురం : ప్రతీ నెలా ఏజెన్సీ ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలతో పాటు, సువార్త దండయాత్ర చేపడుతున్న పెద్దాపురం మండలం తిరుపతి క్రిష్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సిజిఎం) 11వ వార్షికోత్సవం, క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం సువార్త సంగీత క్రిస్టస్ వేడుకను ఆదివారం సాయంత్రం అత్యంత ఘనంగా నిర్వహించారు. సంస్థ పౌండర్ ట్రస్టీ నంగిన శామ్యూల్ సుదీప్ ఆధ్వర్యంలో స్థానిక చర్చి సమీపంలోపి మైదాన ప్రాంగణంలో తిరుపతి గ్రామ పరిసర, ఏజెన్సీ ప్రాంతాల విశ్వాసులతో క్రిస్మస్ ఆరాధనను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన క్రిస్మస్ ఆరాధన సభలో కష్ణాజిల్లా పెదలంక ఉజ్జీవ ప్రసంగీకులు, హెూలీ టీమ్ డైరెక్టర్, ప్రముఖ దైవజనులు జాన్ మంగాచార్యులు మాట్లాడుతూ సర్వమానవాళిక మార్గదర్శి క్రీస్తు ఏసు ప్రభువేనన్నారు. అటువంటి క్రీస్తు పరిశుద్ధ ఆచరణలో ప్రతీ ఒక్కరూ నడుచుకోవాలాని జాన్ మంగాచార్యులు బోధించారు. అనంతరం క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం దైవజనులు, సిజిఎం గౌరవాధ్యక్షులు నంగిన సత్యానందం, శాంతకుమారి దంపతులు, సిజిఎం బృందం వారిచే భారీ క్రిస్మస్ కేక్ను కట్ చేయగా ప్రముఖ అంతర్జాతీయ గాయకులు సునీలు, సుజాత, నజరేష్లు ఆలపించిన క్రైస్తవ భక్తిగీతాలు వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సీజీఎం బృందం ఏర్పాటు చేసిన క్రీస్తు ఏసు జననం పశవుల పాక చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ వంకా జాన్, జయకుమార్, కిషోర్ కుమార్, జేమ్స్,, బ్లెస్సింగ్, శాంతివర్ధనా విభిన్న ప్రతిభావంతుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు. పాస్టరమ్మలు నంగిన శాంతకుమారి, నంగిన ప్రేమలత, విశాల, సుజాత, రాయవరపు సత్య, ఏజెన్సీ సువార్తీకులలతో పాటు సిజిఎం బృందం. అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

ఫిజియో థెరపీ సెంటర్ పిల్లల విభాగంను ప్రారంభించిన సత్యానందరావు

విశాలాంధ్ర - రావులపాలెం : డాక్టర్ చింతా మోహన్‌చే రావులపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన (అడ్వాన్స్ ఫిజియో థెరపీ-రిహబిలిటేషన్) నందు పిల్లల విభాగంను రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు, కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుత్తుల పట్టాభిరామారావు, యల్లమిల్లి జగన్మోహన్, సిద్దిరెడ్డి శ్రీను, సాధనాల శ్రీను, చిట్టూరి శ్రీను పాల్గొన్నారు.

చిర్ల గెలుపును ఆకాంక్షిస్తూ సోషల్ మీడియా వారియర్స్ పాదయాత్ర

విశాలాంధ్ర - రావులపాలెం : ప్రభుత్వ విప్ మరియు శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి మరలా గెలు పొందాలని, 2024లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరలా విజయకేతనం ఎగురవేయాలని ఆకాంక్షిస్తూ సుమారు 150 మంది వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కొత్తపేట నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్ రావులపాలెం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయం నుండి అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రను డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ పాటి శివకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. రావులపాలెం నుండి మొదలై మందపల్లి, ఏనుగుల మహల్, బొడిపాలెం వంతెన, కొత్తపేట గ్రామం మీదుగా కోర్ట్ రోడ్, వాడపాలెం, వానపల్లి గ్రామాల మీదుగా అయినవిల్లి వరకూ సుమారు 27 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది మార్గ మధ్యంలో చిర్ల జగ్గిరెడ్డి వారిని కలిసి అయినవిల్లి ఆలయంలో శ్రీ విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిర్ల మాట్లాడుతూ తన గెలుపును ఆకాంక్షిస్తూ పాదయాత్ర చేసిన సోషల్ మీడియా విభాగం సభ్యులందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియచేశారు.

వృద్ధులకు గంగరాజు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - కరప : మానవసేవయే మాధవ సేవ అని తలచి ప్రతి సంవత్సరం తను సంపాదించిన ఆదాయం నుండి పేదలకు సేవ చేయాలనే సదుద్దేశంతో కరప గ్రామానికి చెందిన రెడ్డి వీరభద్రరావు కుమారుడు రెడ్డి గంగరాజు ఆదివారం వందమంది వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. కిరణ్ కుమార్, మయూర్ జైన్ గుప్తా సహాయ సహకారాలు తీసుకుని రెడ్డి గంగరాజు దుప్పట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, రెడ్డి రాముడు రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి సిబ్బంది పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు దుర్మార్గమైన చర్య

విశాలాంధ్ర - కిర్లంపూడి : అంగన్వాడీల వర్కర్ల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి అవలంబించడం మంచిది కాదని, జనసేన పార్టీ జగ్గంపేట నియోజక వర్గం ఇంచార్జ్ పాఠం శెట్టి సూర్యచంద్ర అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడిలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి సిబ్బంది చేస్తున్న సమ్మె కార్యక్రమానికి జనసేన పార్టీ తరఫున తమ పూర్తి మద్దతును తెలియజేశారు. సూర్యచంద్ర మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న సమ్మె దృష్టిలో పెట్టుకుని యూనియన్ నాయకులతో సంప్రదింపులు జరిపి అంగన్వాడి సిబ్బందికి న్యాయం చేయవలసింది పోయి, ప్రభుత్వం దుర్మార్గంగా, సచివాల యం సిబ్బంది, వాలంటీర్ వ్యవస్థతో అంగన్వాడి సెంటర్ల తాళాలను బద్దలు కొట్టించి సెంటర్లను స్వాధీనం చేసుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆయన వెంట మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఉలిసి అయిరాజు, గోకేడ రాజా పలువురు జనసైనికులు, సిఐటియు నాయకులు సిహెచ్ రత్నం, తెలగరెడ్డి జీవా మాట్లాడుతూ అంగన్వాడి సిబ్బంది న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోవడమే కాకుండా, చిన్నారులకు న్యాణ్యమైన పౌష్టికాహారాన్ని సరపరా చేయడంలేదని ఆరోపించారు.